సాక్షి నిర్మల్

సోమవారం । 1 । జూలై । 2024



‘ట్రిపుల్’ ట్రబుల్స్.. పట్టవా?

బాసర ట్రిపుల్‌ఐటీలో సమస్యలు తిష్టవే శాయి. విద్యార్థుల సమస్యలు ఎవరు పట్టిం చుకోవడంలేదు. దిక్కుతోచని స్థితిలో వారు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

8లో



ఇక సెలవు..

ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంతిమయాత్రలో ప్రజలు, అభిమానులు అధి కసంఖ్యలో పాల్గొన్నారు. తమ అభిమాన నేతకు కన్నీటి వీడ్కోలు పలికారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం 32.0 /26.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావ రణం చల్లబడుతుంది. జిల్లాలో అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 1నుంచి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దని సూచించారు. ప్రజాధనానికి నష్టం కలిగించే పనులు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. నిషేధిత ఆయుధాలు, పేలుడు పదార్థాలు నిషేధమని తెలిపారు. జన సమూహంలో పొగ తాగడం కూడా నేరమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

అడెల్లిలో భక్తుల సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగాపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం అర్ధరాత్రి నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చారు. ఆదివారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

కుంటాల: మండలంలోని ఆయా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గజేందర్, సిద్ధిరాం, సోమేశ్వర్, రవి ఇటీవల ప్రమోషన్ పొందగా వీరిని ఆదివారం కుంటాలలో మున్నూరు కాపు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. సబ్బిడి నర్సయ్య, కొత్త కాపు నారాయణ, దాసరి రమేశ్ పాల్గొన్నారు.

ముంచేశారు!



మొదలైన చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గింపు పనులు

సోన్ మండలం శాకెర గ్రామం వద్ద స్వర్ణనదిపై నిర్మించిన చెక్‌డ్యామ్ ఇది. ప్రతీ వానాకాలంలో స్వర్ణనది నీరు వృథాగా గోదావరిలో కలిసిపోయేది. నీటిని ఒడిసిపట్టి పంటలకు అందించేందుకు నది పొడవునా చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. ఈమేరకు 2016లో శాకెర వద్ద రూ.4.60 కోట్లతో 175 మీటర్ల పొడవుతో ఈ చెక్‌డ్యామ్ కట్టారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ.. రెండేళ్లక్రితం జిల్లాకేంద్రంలోని జీఎస్‌ఆర్ కాలనీ జలప్రళయంలో చిక్కుకోవడానికి ఈ చెక్‌డ్యామే కారణం కావచ్చంటూ ఇటీవల దీని ఎత్తు ఒక మీటర్ తగ్గించే పనులు ప్రారంభించారు. రూ.కోట్లు పెట్టి కట్టే ముందు డ్యామ్‌తో ఎలాంటి ముంపు ఏర్పడుతుందన్న అంచనా వేయలేదా..? అన్న ప్రశ్నలు వస్తున్నాయి. అంతకంటే ముందు.. అసలు ముంపు ప్రాంతంలో నివాసముండేందుకు జీఎస్‌ఆర్ కాలనీకి ఎలా అనుమతిచ్చారో.. అనే సందేహం కలగకమానదు.

- అనాలోచిత నిర్ణయాలతో అస్తవ్యస్తం
- నిర్మల్‌లో కూల్చివేస్తున్న నిర్మాణాలు
- సుందరీకరణ మూణ్నాళ్ల ముచ్చటే!
- జీఎస్‌ఆర్ కాలనీకి ముంపు ముప్పు
- మీటర్ మేర చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గింపు!
- వృథా అవుతున్న ప్రభుత్వ నిధులు
- పాలకులు, అధికారుల్లో తప్పెవరిదో?



ఫౌంటెయిన్‌ను పొక్లెయిన్‌తో కూల్చివేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఇలా కూల్చాల్సిందే..

ఈ ఫొటోలు చూస్తేనే విషయం అర్థమైపోతుంది. జిల్లాకేంద్రంలో సుందరీకరణ పనుల్లో భాగంగా 2018లో స్థానిక జయశంకర్‌సార్ చౌరస్తాలో దాదాపు రూ.5లక్షలకు పైగా వెచ్చించి ఫౌంటెయిన్ నిర్మించారు. నిర్మల్ బ్రాండ్‌అంబాసిడరైన కొయ్యబొమ్మలతో కూడిన ఈ ఫౌంటెయిన్ ఆకట్టుకునేది. రాత్రిళ్లు లైట్ల వెలుగుల్లో విరజిమ్మే ఫౌంటెయిన్ వద్ద చాలామంది సెల్ఫీలూ దిగేవారు. అలాంటి నిర్మాణం ఇప్పుడు నేలమట్టమైంది. ఇందుకు పాలకులు, అధికారులు చెబుతున్న కారణం.. ట్రాఫిక్ సమస్య. ఇలాంటి సమస్య వస్తుందని రూ.లక్షలు పెట్టి ఫౌంటెయిన్ నిర్మించే ముందు తెలియదా..? లేక సమస్య పరిష్కరించడానికి మున్సిపల్ వద్ద మరో మార్గం లేదా?.. అని నిర్మల్‌వాసులు ప్రశ్నిస్తున్నారు.



కొయ్యబొమ్మలతో అందంగా నిర్మించిన ఫౌంటెయిన్ (ఫైల్)

నిర్మల్: ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా.. ఏ నిర్మాణం చేయాలన్నా.. ముందుగా వాటితో కలిగే లాభనష్టాలను లెక్కవేసుకున్న తర్వాతే చేపట్టాల్సి ఉంటుంది. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుచూపుతో నిర్మాణాలు చేయాలి.. కానీ.. ఇటీవల జిల్లాలో కొన్ని పనుల తీరు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నట్లుందని జిల్లావాసులు ఆరోపిస్తున్నారు.

ఎవరు బాధ్యులు?

ఎక్కడ ఏ డ్యామ్ నిర్మిస్తున్నా కచ్చితంగా ముంపు ప్రాంతాలను అంచనా వేస్తారు. నిర్మల్ సమీపంలో శాకెరలోనూ అలాగే నిర్మించారు. కానీ.. పైభాగంలోని జీఎస్‌ఆర్ కాలనీ మూడేళ్లుగా మునుగుతోంది. ఈకారణంగా ఇప్పుడు చెక్‌డ్యామ్ ఎత్తు తగ్గిస్తున్నారు. దీంతో ఎంతమేరకు ముంపు ప్రభావం తగ్గుతుందనేది ఎవరూ చెప్పరు. జీఎస్‌ఆర్ కాలనీ మునగడానికి ఈ చెక్‌డ్యామే కారణమంటూ శాస్త్రీయంగా తేల్చిన దాఖలాలూ లేవు. అసలు.. ఎగువన ప్రాజెక్ట్ ఉన్న ఓ నది ఒడ్డున, అది కూడా ముంపు ప్రాంతంలో ప్రజలు నివాసం ఉండేలా ఓ కాలనీకి ఎలా అనుమతులిచ్చారన్న వాదన ఇప్పటికీ ఉంది. ఈ వెంచర్ ప్రారంభంలోనే అప్పటి మున్సిపల్ కమిషనర్ దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా, రాజకీయంగా ఒత్తిడి తెచ్చారు. ఏమాత్రం ముందుచూపు లేకుండా ముంపు ప్రాంతంలోనే ప్లాట్లు చేసేశారు. ఊరికి కాస్త దూరమైనా.. తమకు అనుకూలమైన ధరలో రావడంతో చాలామంది మధ్యతరగతి కుటుంబాల వాళ్లు అక్కడ ప్లాట్లు కొనుక్కుని ఇళ్లు కట్టుకున్నారు. మూడేళ్లుగా తమ కాలనీ మునుగుతుండటంతో వారంతా లబోదిబోమంటున్నారు. ఇలా జరుగుతుందని ముందే చెబితే.. ఇక్కడ ఇళ్లు కట్టేవాళ్లమే కాదని వాపోతున్నారు. ఈ కాలనీతో పాటు పంటపొలాలకు ముంపు తప్పించడానికే ఇప్పుడు చెక్‌డ్యామ్ ఎత్తు మీటర్ తగ్గిస్తున్నట్లు అధికారుల చెబుతున్నారు.

ప్రజాధనం వృథా కాదా?

జిల్లాగా ఏర్పడ్డాక దినదినాభివృద్ధి చెందుతున్న నిర్మల్ మున్సిపాలిటీలో 2018–19లో సుందరీకరణ పనులు చేపట్టారు. రూ.కోట్లతో ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, శివాజీచౌక్, జయశంకర్‌సార్ చౌరస్తా, అంబేద్కర్‌చౌక్‌లలో ఫౌంటెయిన్‌లు నిర్మించారు. ఇరువైపులా పచ్చని చెట్లతో పాటు డివైడర్‌లో ఆకట్టుకునే లైట్లూ అమర్చారు. దీంతో నిర్మల్ పట్టణ లుక్కే మారిపోయింది. ఇక్కడి సుందరీకరణను చూసి ఆదిలాబాద్ లాంటి పట్టణాల్లోనూ పనులు చేపట్టారంటే అతిశయోక్తి కాదు. అలాంటి నిర్మాణాలు నిర్వహణ లేక ఐదేళ్లకే నామరూపాలు కోల్పోతున్నాయి. ఇప్పటికే ఫుట్‌పాత్ మొత్తం దెబ్బతింది. వాటిపై వీధివ్యాపారాలు కొనసాగుతున్నాయి. పచ్చని చెట్లు మొత్తం ఎండిపోయాయి. విద్యుత్ లైట్లూ వెలగడం లేదు. తాజాగా ట్రాఫిక్ సమస్య పేరిట జయశంకర్‌సార్ చౌరస్తాలో దాదాపు రూ.5లక్షలతో అందంగా నిర్మించిన ఫౌంటెయిన్‌ను అధికారులు కూల్చివేయించారు.

సమన్వయంతో పని చేస్తే..

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పాలకులు, అధికారులు ఏ పనులు చేసినా.. సమంజసమేనని, కానీ ప్రజాధనం వృథా చేసేలా ఉండకూడదని జిల్లావాసులు పేర్కొంటున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న జిల్లాలో ఏ పనులు చేసినా.. ముందుచూపుతో చేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. కేవలం జీఎస్‌ఆర్ కాలనీయే కాకుండా మిగతా ముంపు ప్రాంతాలపైనా దృష్టిపెట్టాలంటున్నారు. రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతున్న జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీర్చేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ముడుపు చెల్లింపు



ముడుపు చెల్లించేందుకు వెళ్తున్న పెంబి వాసులు, కాంగ్రెస్ నాయకులు

పెంబి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలవాలని కాంగ్రెస్ పెంబి మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి అడెల్లి పోచమ్మ, మహారాష్ట్రలోని మహోర్ ఎల్లమ్మ తల్లికి ముడుపుకట్టారు. బొజ్జు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆదివారం ఆయా ఆలయాలకు పెంబివాసులు, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక బస్సులో వెళ్లారు. అమ్మవార్లకు పూజలు చేసి కట్టిన ముడుపు, మొక్కులు చెల్లించుకున్నారు.

భీమన్న దేవుని పండుగ



పూజలు చేస్తున్న భక్తులు

భైంసాటౌన్: పట్టణంలోని పురాణాబజార్‌లో గల భీమన్న ఆలయంలో భీమన్న దేవుని పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ నాయకపోడ్ సేవాసంఘం ఏటా పండుగను నిర్వహిస్తోంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని భీమన్న దేవున్ని వేడుకున్నారు. పూజల్లో సంఘ సభ్యులు సాంబన్న, సునీల్, శేఖర్, రాందాస్, పోతన్న, లక్ష్మణ్, సతీశ్, దశరథ్ తదితరులున్నారు.

చిన్నయ్య, పెద్దయ్యకు పూజలు



మొక్కు చెల్లించుకుంటున్న వీడీసీ సభ్యులు

పెంబి: మందపల్లి గ్రామంలోని అటవీప్రాంతంలోగల ఏదుల్లగుట్టపై ఉన్న చిన్నయ్య, పెద్దయ్యకు వీడీసీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. చిన్నయ్య, పెద్దయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు. వీడీసీ చైర్మన్ భీమన్న, వైస్ చైర్మన్ దుబ్బన్న, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోరుగా గుట్కా దందా..!

- పాన్‌మసాలా పేరిట విక్రయాలు
- పోలీసుల దాడులతో వెలుగులోకి..



భైంసాలోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ రాజారెడ్డి

భైంసాటౌన్: పట్టణంలో నిషేధిత గుట్కా దందా జోరుగా సాగుతోంది. పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే పలు దుకాణాల్లో విక్రయాలు కొనసాగుతున్నాయి. పాన్ మసాలా పేరిట తప్పుదోవ పట్టిస్తూ గుట్కా ఉత్పత్తులను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. శనివారం పోలీసులు జరిపిన తనిఖీల్లో భారీగా గుట్కా ఉత్పత్తులు పట్టుబడడం ఇందుకు నిదర్శనం. కొన్నేళ్లుగా పట్టణంలో గుట్కా దందా కొనసాగుతున్నా పోలీసులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొంతకాలంగా గుట్కాపై నిషేధం లేదంటూ వ్యాపారులు ఇష్టారీతిన విక్రయాలు చేపట్టారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గుట్కాను నిషేధిత జాబితాలో చేర్చడంతో పోలీసులు దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. శనివారం ఒక్కరోజే పట్టణంలో రూ.6 లక్షల విలువైన గుట్కా పట్టుబడగా, జిల్లాలో దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

పాన్ మసాలాల పేరిట..

గుట్కాపై నిషేధం నేపథ్యంలో వ్యాపారులు కొత్త ఎత్తుగడతో దందా నిర్వహిస్తున్నారు. పాన్ మసాలాపై నిషేధం లేదంటూ ఇష్టారీతిన గుట్కా విక్రయాలు చేపడుతున్నారు. శనివారం సీఐ డీ రాజారెడ్డి నేతృత్వంలో పట్టణంలోని ఓ దుకాణంలో తనిఖీ చేపట్టగా, సదరు ప్యాకెట్లన్నీ పాన్ మసాలేనని వ్యాపారి పేర్కొనడం గమనార్హం. దీంతో ప్యాకెట్లు విప్పి పరిశీలించిన సీఐ గుట్కా ఉత్పత్తులేనని నిర్ధారణకు వచ్చి స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ దుకాణంతోపాటు ఆటోనగర్, బాసర ఎక్స్‌రోడ్ సమీపంలోని గోదాంలలో రూ.లక్షల విలువైన గుట్కా నిల్వ చేసి, ద్విచక్రవాహనాలపై సంచుల్లో తరలిస్తూ పాన్ షాపులు, కిరాణా షాపులకు తరలిస్తూ గుట్టుగా దందా కొనసాగిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం గుట్కాను నిషేధించడంతో పోలీసులు దాడులు జరిపి స్వాధీనం చేసుకుంటున్నారు.

ఉత్తుత్తి తనిఖీలేనా..?

ప్రభుత్వం గుట్కాపై నిషేధం విధించడంతో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు చేపట్టి గుట్కా నిల్వలు స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతోపాటు భైంసా పట్టణంలోనూ పోలీసులు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టి భారీగా డంపులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, కొన్ని నెలల కిందట ఇసుక దందాపై కూడా ఇలాగే దాడులు జరిపి డంపులు సీజ్ చేశారు. తరువాత దందా గురించి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలొచ్చాయి. తాజాగా గుట్కా స్థావరాలపై దాడులు నిర్వహించిన పోలీసులు పూర్తిస్థాయిలో గుట్కా విక్రయాలను నియంత్రించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

గుట్కా విక్రయిస్తే చర్యలు

నిషేధిత గుట్కా, తంబాకు ఉత్పత్తులు నిల్వ చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటాం. ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాల మేరకు దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నాం. ఎక్కడైనా గుట్కా విక్రయాలు చేపడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలి.

– డీ రాజారెడ్డి, సీఐ, భైంసా టౌన్

ఇక ఎస్జీటీల వంతు..!

- బదిలీలకు వెబ్ ప్రక్రియ పూర్తి
- అనధికారికంగా రేషనలైజేషన్
- నేడు బదిలీ ఉత్తర్వులు జారీ!
- 898 మంది టీచర్ల దరఖాస్తు



భైంసాలో బదిలీలకు వెబ్ ఆప్షన్లు ఇస్తున్న టీచర్లు

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో మరో ఘట్టం మొదలైంది. ఎస్జీటీ క్యాడర్ ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. రెండురోజుల క్రితం జిల్లాలో సీనియార్టీ జాబితాను విడుదల చేశారు. ఆదివారం ఉదయం నుంచి వెబ్ ఆప్షన్ ప్రక్రియ మొదలైంది. జిల్లాలో ఎస్జీటీలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. రిటైర్మెంట్ వయసుకు రెండేళ్లున్నవారికి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు సోమవారం రాత్రి వరకు బదిలీ ఉత్తర్వులు అందనున్నాయి. వీరంతా మంగళవారం ఆయా స్థానాల్లో జాయిన్ కావాల్సి ఉంటుంది.

వెబ్ ఆప్షన్ ప్రక్రియ పూర్తి..

ఎస్జీటీ తత్సమాన క్యాడర్‌లో బదిలీల కోసం ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వెబ్ ఆప్షన్ ప్రక్రియ చేపట్టి ముగించింది. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఎడిట్ ఆప్షన్‌కు సమయం ఇచ్చింది. ఆరేళ్ల తర్వాత బదిలీల పర్వం ఊపందుకోవడంతో ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే జిల్లాలో పండిత, పీఈటీ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రమోషన్లతో కూడిన బదిలీల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఎస్జీటీల బదిలీ ప్రక్రియను పకడ్బందీగా, విజయవంతంగా చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

జిల్లాలో 898 దరఖాస్తులు

జిల్లావ్యాప్తంగా 898 మంది ఎస్జీటీలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 883 మంది ఎస్జీటీలు కాగా, ఆరుగురు తెలుగు భాషా పండితులు, ఒకరు హిందీ భాషా పండితుడు, ఏడుగురు పీఈటీలు, ఒకరు ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం బదిలీల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత కొందరు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ అప్పుడే ఆగిపోయింది. తాజాగా షెడ్యూల్ ప్రకటించారు. అప్పుడు దరఖాస్తు చేసుకున్న వారితోపాటు తాజాగా అర్హులైన వారికి ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. అయితే విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలను వెబ్ ఆప్షన్‌లో చూపించకపోవడంతో ఉపాధ్యాయ వర్గాల్లో కలవరం మొదలైంది. తాజాగా ప్రమోషన్లు ఇవ్వడంతో ఏర్పడిన ఖాళీలతో పాటు అన్ని ఖాళీలను చూపించాలని ఉపాధ్యాయ వర్గాలు పట్టుబడుతున్నాయి. ప్రభుత్వం ఇందుకు ససేమిరా అంటోంది.

రేషనలైజేషన్ ప్రక్రియ షురూ..

విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల తరలింపు ప్రక్రియ ఈ బదిలీ ప్రక్రియలో మొదలైనట్లు ఉపాధ్యాయవర్గాలు భావిస్తున్నాయి. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. దీంతో తక్కువ విద్యార్థులున్న పాఠశాలలో ఎక్కువమంది ఉపాధ్యాయులు, ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలో తక్కువ మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ కారణంగా నాణ్యత ప్రమాణాలు తగ్గుతున్నాయి. దీనిని సరిచేసేందుకు ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా విద్యాశాఖలో నాణ్యత ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఒక్క విద్యార్థి లేని పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించడం లేదు. అలాగే ఒకటి నుంచి 10 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఒక ఖాళీ, 11 నుంచి 40 మంది వరకు విద్యార్థులున్న పాఠశాలల్లో రెండు ఖాళీలు, 40 నుంచి 60 వరకు విద్యార్థులున్న పాఠశాలలో మూడు ఖాళీలు, 60 పైబడి విద్యార్థులున్న పాఠశాలలో అన్ని ఖాళీలను వెబ్ ఆప్షన్‌లో చూపించారు. రేషనలైజేషన్ ప్రక్రియ చేయడం ద్వారా సీనియర్ ఉపాధ్యాయులు లాస్ అవుతారని జిల్లాలో ఉన్న అన్ని ఖాళీల జాబితా ప్రదర్శించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



కుంటాల:1999-2000 బ్యాచ్ విద్యార్థులు



కుంటాల: 1996-97 బ్యాచ్ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

కుంటాల/ఖానాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన ఎస్సెస్సీ 1996–1997, 1999–2000 బ్యాచ్‌ల పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. రోజంతా సరదాగా గడిపి సహపంక్తి భోజనం చేశారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. రోజంతా సరదాగా గడిపి విద్యార్థులంతా కలిసి సహపంక్తి భోజనం చేశారు. అలాగే ఖానాపూర్ మండలం మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 2004–05లో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనం గ్రామంలోని ఎల్ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సుమారు 50 మంది పూర్వవిద్యార్థులు ఒక్కచోట చేరి సందడి చేశారు. అప్పటి ఉపాధ్యాయులు హరీశ్‌రెడ్డి, వెంకటరమణను ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు.



ఖానాపూర్: 2004-05 బ్యాచ్ విద్యార్థులు

క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న పోలీసులు

ఖానాపూర్: దిలావార్‌పూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం గేటు తాళం పగులగొట్టి లోనికి వెళ్లిన దుండగులు అమ్మవారిపై ఉన్న 500 గ్రాముల వెండి కిరీటంతో పాటు 15 గ్రాముల బంగారు పుస్తెలు, ఒక గ్రాము బంగారు ముక్కు పుడక, హుండీలో ఉన్న నగదును సైతం ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై శ్రీనివాస్‌వర్మ తెలిపారు.

వైన్‌షాపు ఉద్యోగిని బెదిరించి నగదు కాజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల శ్రీనివాస వైన్‌షాపులో కౌంటర్ వద్ద పనిచేస్తున్న ఉద్యోగిని బెదిరించి నగదు కాజేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి శ్రీనివాస వైన్‌షాపులోకి వెళ్లిన అసీపొద్దీన్ ఖురైషీ బెదిరించి రూ.3వేల నగదు లాక్కుని అక్కడి నుంచి ఉడాయించాడు. దీంతో బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

బేల: కాంఘర్‌పూర్ శివారులోని పెన్‌గంగ నుంచి ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఇసుకతో నిండిన టిప్పర్‌పై జిల్లా మైనింగ్ శాఖకు, ఖాళీ టిప్పర్‌పై తహసీల్దార్‌కు తదుపరి చర్యల కోసం నివేదించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురు గుట్కా విక్రేతలపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా గుట్కా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ సమీ, ఇమ్రాన్ ఖాన్, షేక్ మోసిన్ శనివారం రాత్రి అస్లాం ట్రేడర్స్ నుంచి గుట్కా కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి వారిని తనిఖీ చేయగా రూ.2,300 విలువ గల గుట్కా ప్యాకెట్లు లభించినట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘ట్రిపుల్’ ట్రబుల్స్ ఎవరికీ పట్టవా?

- విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోరు
- వారికి మాట్లాడే అవకాశం కూడా లేదు..
- క్యాంపస్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టదు..
- వర్సిటీలో అంతా రహస్యమేనా?


బాసర ట్రిపుల్ ఐటీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అంటే రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ తెలిసిందే... కానీ ఇక్కడ చదివే విద్యార్థుల సమస్యలు మాత్రం ఎవరికీ తెలియవు. ఏం జరిగినా గుట్టుగా ఉంచడం రహస్య క్యాంపస్‌గా మార్చడమే ఉన్నతాధికారుల లక్ష్యంగా కనిపిస్తోంది. చదువుకునే పిల్లలకు జైలు వాతావరణం తలపించే పరిస్థితులు కనిపిస్తున్నా ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఓ కమిటీ వేసుకుందామన్నా అనుమతించడం లేదు. కమిటీ కోసం దరఖాస్తు చేసుకుంటే ఏదో ఒక వంక చూపి విద్యార్థులను ఇబ్బందులు పెట్టడమే కాకుండా వారికి కమిటీ వేసుకునే పరిస్థితులను మరింత క్లిష్టం చేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనలు, నిరసనలు ఇలా ఏదో ఒక విషయంలో ట్రిపుల్‌ఐటీ ఎప్పుడూ వార్తల్లో కనిపిస్తున్నా శాశ్వత పరిష్కారం మాత్రం ఎవరూ చూపడం లేదు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డారు. బాసర ట్రిపుల్‌ఐటీ రహస్య క్యాంపస్‌గా మారింది. అక్కడ ఏంజరిగినా బయటకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. మీడియా, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, మేధావులు ఎవరైనా సరే లోపలికి మాత్రం అనుమతించరు.

ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థులు..

మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం ఇక్కడ చదివే విద్యార్థులంతా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రెండేళ్ల క్రితం చేపట్టిన ఉద్యమంలాగే ఇప్పుడు కూడా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. గతంలో కొంతమంది విద్యార్థులే టార్గెట్‌గా చేసి కేసులు పెట్టారు. ఇప్పుడు విద్యార్థులంతా ఐక్యంగా వెళ్లి తమ సమస్యలు వినిపించి కమిటీ వేసి పోరాడాలని ఆలోచిస్తున్నారు. క్యాంపస్ అధికారులు కమిటీకి అనుమతించాలని కోరుతున్నారు. నిబంధనల పేరిట కాలయాపన చేస్తే విద్యార్థులంతా ఐక్యంగా నిరసనలకు దిగాలని నిర్ణయించారు. తమ సమస్యలను వినకుంటే నిరవధిక ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. ఏళ్ల తరబడి సమస్యలతో సహవాసం చేస్తున్న తమ ఇబ్బందులు తీర్చే మార్గం చూపాలని కోరుతున్నారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జనవరిలో అసెంబ్లీలోనూ ట్రిపుల్ ఐటీ ప్రక్షాళన చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి పెట్టి ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

భరోసా లేక...

తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసాగా ఉంటుందనుకునే ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో ఇటీవలి కాలంలో వరుసగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా మరో విద్యార్థి తన నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాడు. వేలాది మంది ఉండే ఈ క్యాంపస్‌లో చదివే విద్యార్థులకు మనోధైర్యం ఇచ్చే వాళ్ళు లేకపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. రోజూ చదివే విద్యార్థులపై యూనివర్సిటీ అధికారులు దృష్టి పెట్టలేకపోతున్నారు. 9వేల మంది విద్యార్థులు ఉండే ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో తరగతి గదుల్లో నీరసంగా, అసహనంగా, ఒంటరిగా ఉండే వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి మనోధైర్యాన్ని కల్పిస్తే ఆత్మహత్యలు కాస్తయినా ఆగుతాయి. విద్యార్థులు ఒత్తిడిలో చదువుతారు. చదువు పూర్తవుతున్న సమయంలోనూ ప్లేస్‌మెంట్, కుటుంబ పరిస్థితులు ఇతర వ్యసనాలు వారిలో పదేపదే మానసిక ఒత్తిడిని పెంచుతుంటాయి. ఈ ఒత్తిడిని తగ్గించేలా క్యాంపస్‌లో క్రీడలు, సంగీతంపై మక్కువ పెంచేలా చూడాలి. వారానికి ఒక్కరోజైనా విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య అన్నింటినీ మరిచి మానసిక ప్రశాంతతను పొందేలా వారిని ప్రేరేపించాలి. ఇష్టమైన రంగంలో ఆటలు ఆడుకునేవీలు కల్పించాలి. ఎంతోమంది విద్యార్థులు ఉన్న ఈ క్యాంపస్‌లో అప్పుడప్పుడు వినోదాన్ని పంచే కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులంతా ఒంటరిగా ఉండకుండా ఎవరితోనైనా తమ బాధలు చెప్పుకునే పరిస్థితులు కల్పించాలి. భయం మధ్య, ఏంజరుగుతుందోనన్న క్షణాల మధ్య తరగతి గదుల్లో, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఇలా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ప్రతిక లేక...

విద్యార్థులు ప్రతీరోజు ఆటలు ఆడుకునేలా షెడ్యూల్ ఉంచాలి. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు స్నానాలు, భోజనాలు, తరగతి గదులు వీటితోనే రోజు పూర్తవుతుంది. రోజుకు అరగంటైనా విద్యార్థులంతా ఇష్టమైన క్రీడల్లో పాల్గొనేలా ఏ ఒక్కరూ చూడడంలేదు. క్రీడల్లో ఉన్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి కాస్త దూరమవుతారు. వారంలో ఒక్కరోజైనా చెవులకు ఇంపైన సంగీతం, వినోద కార్యక్రమాలు తిలకించే ఏర్పాట్లు చేయాలి. కానీ అవేం ఇక్కడ జరగడంలేదు. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సిలింగ్‌లు ఇప్పిస్తూ మానసికస్థితిని తెలుసుకోవాలి. ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు? ఇప్పుడు ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు అనే విషయాలు చర్చించాలి. క్యాంపస్ అధికారులు మార్చలేకపోయిన ఒంటరితనాన్ని గుర్తించి కుటుంబ సభ్యులైనా వారికి మనోధైర్యం కల్పించి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల పరిస్థితులు తెలుసుకుని వారి మనసుకు అనుగుణంగా నడుచుకుని ఆత్మహత్యలకు అడ్డుకట్టవేయాలని పోషకులు కోరుతున్నారు.

నాటి ప్రభుత్వంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ఆంక్షలపేరుతో ఎవరినీ అనుమతించలేదు. గతేడాది డిసెంబర్ 7న తెలంగాణ రాష్ట్ర సీఎంగా ప్రమాణం స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చారు. ప్రగతిభవన్ ఎదుట ఉన్న ఇనుప కంచెను తొలగించారు. అక్కడే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కానీ బాసర ట్రిపుల్‌ఐటీలో మాత్రం నేటికీ పాత ఆంక్షలే కొనసాగిస్తున్నారు. క్యాంపస్ చుట్టూ ఉన్న భారీ ప్రహరీ దాటి లోనికి ఎవరూ వెళ్లలేరు. పైగా తల్లిదండ్రులను కూడా అనుమతించడం లేదు. ఇంటి నుంచి వండుకొచ్చిన భోజనాలు విద్యార్థులకు పెడదామన్నా పంపించడం లేదు. క్యాంపస్‌కు ఇరువైపులా భారీ గేట్లు నిర్మించి ఎవరినీ అనుమతించడం లేదు. విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా కల్పించడంలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా బాసర ట్రిపుల్‌ఐటీకి వచ్చి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతారని ఇక్కడి విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సీఎం సార్ వస్తేనే...

జిల్లా ఆర్టిస్ట్‌కు అవార్డు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ఆర్టిస్ట్ ద్యావంత్ రమేశ్ ఆదివారం మణికంఠ ఆర్ట్స్ గ్యాలరీ నుంచి అవార్డు అందుకున్నారు. ఆయన ఇటీవల నేషనల్ ఆన్‌లైన్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ కాంపిటిషన్‌లో పాల్గొనగా 12వ రైజింగ్ స్టార్ అవార్డు వచ్చినట్లు పేర్కొన్నారు. చిత్రలేఖనం ద్వారా వేసిన మూడు చిత్రాలను ఎంపిక చేశారు.

‘ఖేలో భారత్’లో ఖానాపూర్ వాసి ప్రతిభ


అవార్డు అందుకుంటున్న యువకుడు

ఖానాపూర్: మండలంలోని చందునాయక్‌తండాకు చెందిన గుగ్లావత్ కళాబా యి–బలి రాం దంపతుల కుమారుడు సురేందర్ ఖేలో భారత్ పోటీల్లో పిస్టల్ అండ్ రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలు నేపాల్‌లోని (పోఖరా) రంగశాల స్టేడియంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించారు. 10 మీటర్ల పిస్టల్ అండ్ రైఫిల్ షూటింగ్‌లో వ్యక్తిగత విభాగంలో గోల్డ్ మెడల్‌తో పాటు టీంతో మరో బంగారు పతకం సాధించాడు. త్వరలో జరుగనున్న ఖేలో ఇండియా పోటీలకు సైతం ఎంపికయ్యాడు.

ఆవును కాపాడిన ఆలయ సిబ్బంది


బాసర: శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది గోతిలో పడిన ఆవును రక్షించారు. గ్రామానికి చెందిన కొండాపురం సాయిలుకు చెందిన ఆవు గుంతలో పడినట్లు ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. స్పందించిన సిబ్బంది ఆవును సురక్షితంగా బయటకు తీశారు.

సీపీఐ రాష్ట్ర సమావేశాల్లో ఉమ్మడి జిల్లా నాయకులు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎదులాపురం: ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమావేశాలకు ఉమ్మడి ఆదిలాబాద్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్, తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి సంబంధించి పలు అంశాలను గురించి చర్చించడం జరిగిందని వెల్లడించారు.

చిత్రం గీసి.. అభిమానం చాటి..



తాంసి: మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ నాయకుడు రమేశ్ రాథోడ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కళాకారుడు గట్టు రాజు పెన్సిల్‌తో మాజీ ఎంపీ బొమ్మను గీసి అస్తమించిన రమేశ్ రాథోడ్ అంటు నివాళి అర్పించాడు.

ఇక సెలవు..

- ముగిసిన రాథోడ్ రమేశ్ అంత్యక్రియలు
- అంతిమ యాత్రలో కిక్కిరిసిన జనం..
- ముఖ్య నేతల నివాళులు


అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు, అభిమానులు

ఉట్నూర్‌రూరల్: బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ఆదివారం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో నిర్వహించారు. అంతకుముందు ఉదయం 11గంటలకు పాత ఉట్నూర్, పెర్కగూడ మీదుగా ఎక్స్‌రోడ్డు వరకు అంతిమయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ – మంచిర్యాల ప్రధాన రహదారులు జనాలతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి 2 గంటలకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాథోడ్ రమేశ్ స్వగృహానికి చేరుకొని పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఎంపీగా, జెడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్యేగా రాథోడ్ రమేశ్ చేసిన సేవలను కొనియాడారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీశ్, రాములు నాయక్, ఎమ్మెల్యేలు జాదవ్ అనిల్, రామారావు పటేల్, మాజీ మంత్రులు ఐకేరెడ్డి, జోగు రామన్న అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడంతో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రమేశ్ రాథోడ్ కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు.


అంత్యక్రియల్లో పాల్గొన్న ఐకేరెడ్డి, జోగు రామన్న, పురాణం సతీశ్


భౌతిక ఖాయం వద్ద నాయకుల నివాళులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బెల్లూరి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వండాల బాలకృష్ణ (36) దుర్మరణం చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలకృష్ణ గతేడాది నుంచి భార్యతో కలిసి మహారాష్ట్రలో నివాసం ఉంటున్నాడు. ఇదే క్రమంలో శనివారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని చాందాలో ఆయన బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బెల్లూరిలోని అయ్యప్ప ఆలయ సమీపంలో గల సైన్‌బోర్డుకు ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతోనే మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని వయస్సు 55 సంవత్సరాల వరకు ఉంటుందని, మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుర్తుపడితే 8712659920 నంబరులో సమాచారం అందించాలని సీఐ అశోక్ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

లోకేశ్వరం: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన పవార్ కృష్ణ (28) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రెండు లారీలు ఢీ

- గంటపాటు స్తంభించిన వాహనాలు


రహదారిపై నిలిచిన వాహనాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని సూర్యగార్డెన్ సమీపంలో ఆదివారం ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీ రోడ్డుపైన పార్కింగ్ చేసిన మరో వాహనాన్ని దాటే క్రమంలో మరోలారీ వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో ఆ దారిగుండా వెళ్లే వాహనాల రాకపోకలకు గంటపాటు అంతరాయం ఏర్పడింది.

రెగ్యులర్ ఏవో ఎక్కడ?


ఖాళీగా ఉన్న ఏవో కుర్చీ

- లోకేశ్వరం ఏవోకు ఇన్‌చార్జి బాధ్యతలు
- పూర్తిస్థాయిలో అందని సేవలు
- సమయపాలన పాటించని ఏఈవోలు
- పంటల సాగుపై అవగాహన కరువు
- ఇబ్బందుల్లో రైతులు

తానూరు: వానాకాలం, యాసంగి సీజన్‌లో ఏ ఏయే పంటలు వేయాలి, రైతులకు సాగుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం రైతువేదికలు నిర్మించింది. ఏవో(వ్యవసాయ అధికారి)లు వారికి సాగులో సలహాలు, సూచనలు చేసి వారి సందేహాలను నివృత్తి చేయాలి. అయితే తానూర్‌లో రెగ్యులర్ (ఏవో) నియమించకపోవడంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కేవలం వ్యవసాయ విస్తీర్ణ అధికారుల(ఏఈవో)తోనే సరిపెడుతున్నారు. రైతువేదికల్లో కొందరు అందుబాటులో ఉండకపోవడం, మరికొందరు సమయపాలన పాటించడం లేదు.

ఐదేళ్లుగా ఇన్‌చార్జి ఏవో దిక్కు..

మండలంలో ఏవో పోస్టు ఖాళీగా ఉంది. ఏడుగురు ఏఈవోలు విధులు ఉన్నారు. గత ఐదేళ్లుగా ఇన్‌చార్జి ఏవోతో నెట్టుకొస్తున్నారు. లోకేశ్వరం ఏవో గణేశ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. నెలకోసారి మండలానికి రాలేదని, పూర్తిస్థాయి సేవలందడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్న ఏడుగురిలో కొందరు ఏఈవోలు క్లస్టర్‌లో అందుబాటులో ఉండడం లేదు. అప్పుడప్పుడు తానూరు రైతువేదిక కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారు. పంటల సాగు, రైతుబంధు విషయంపై ఏవో, ఏఈవోలకు ఫోన్ చేస్తే స్పందించడం లేదనే విమర్శలు వెలువెత్తున్నాయి.

నకిలీ విత్తనాలపై నజర్ ఏది?

రైతులు వానాకాలం పంట సాగు చేసుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఒకటి రెండు షాపుల్లో తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. గత రెండేళ్ల క్రితం కొందరు మహారాష్ట్ర నుంచి నకిలీ పత్తి విత్తనాలు తెచ్చి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. గత మూడేళ్ల క్రితం ఉమ్రి(కే) గ్రామంలోని గోదాంలో కాలం చెల్లిన మందులు ఉన్నాయని సమాచారంతో పోలీసులు తనిఖీ నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది తనిఖీలు లేక నకిలీ దందాలో ఎందరు రైతులు నష్టపోతారో తెలియని పరిస్థితి ఉంది.

తెరుచుకోని రైతువేదికలు

మండలంలో మొత్తం ఏడు క్లస్టర్‌ల్లో గత ప్రభుత్వం రైతువేదికలు నిర్మించింది. వేదికల్లో ఏఈవోలు అందుబాటులో ఉండి భూసారపరీక్షలు నిర్వహించి, ఎలాంటి పంటలు వేయాలి, తెగుళ్ల నివారణ చర్యల గురించి వివరించాలి. కొందరు అందుబాటులో లేకపోవడంతో రైతువేదికలు తెరుచుకోవడం లేదు. తానూరు, దౌలతాబాద్, బెల్‌తరోడా మినహా ఎక్కడ తెరుచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూములు కొనుగోళ్లు చేసిన రైతులు రైతుబంధు, రైతుభరోసా పథకాల దరఖాస్తు చేసుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. వ్యవసాయ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని వాపోతున్నారు. అధికారుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల నాయకులు ఫోన్ చేస్తే స్పందిస్తున్నారు తప్ప తమ ఫోన్ చేస్తే ఎత్తడం లేదని పలువురు రైతులు మండిపడుతున్నారు.

అందుబాటులో ఉండాలి



ఏఈవోలు రైతువేదిక కార్యాలయంలో అందుబాటులో ఉండాలి. క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలి. సబ్సిడీపై వచ్చే పరికరాల వివరాలు తెలపాలి.

– మహేశ్, యువ రైతు, ఎల్వి గ్రామం

రెగ్యులర్ ఏవోను నియమిస్తాం

తానూరు మండలానికి రెగ్యులర్ ఏవో నియమించేలా చూస్తాం. ఏఈవోలతో పంటలు పరిశీలించేలా చూస్తాం. రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– అంజిప్రసాద్, డీఏవో

ఉద్యోగ విరమణ సన్మానం


హెచ్‌ఎం విజయను సన్మానిస్తున్న నాయకులు

సోన్: మండలం కడ్తాల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కొండాడి విజయ ఉద్యోగ విరమణ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బీ.వీ రమణరావు ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఆమెకు ఆదివారం పూలమాల వేసి సత్కరించారు. విజయ ఉత్తమ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో సోన్ మండల అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి భూమారెడ్డి, నిర్మల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరమేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రమేశ్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం ఆరాధన తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పోతన్న ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆదివారం సన్మానించారు. పోతన్న దంపతులకు శాలువా కప్పి సత్కరించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.భూమన్న యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సభ్యులు సిరాజుద్దీన్, ఎం.శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు, సంఘ నాయకులు అశోక్ కుమార్, నాగభూషణ్, మటం పరమేశ్వర్, దిగంబర్, శివలింగయ్య, లక్ష్మీనారాయణ, లఖన్, లక్ష్మీపతి, అనంత కిశోర్, ఉపాధ్యాయినులు శ్రీదేవి, సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

స్కూల్ బ్యాగులు పంపిణీ

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వెన్నెల డ్యాన్స్ ఆకాడమీ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కృష్ణంరాజు హాజరై వారికి అందజేశారు. సంస్థ డైరెక్టర్ ధనరాజ్, నాగరాజు, పాఠశాల ఇన్‌చార్జి మేరీ మార్గరేట్, జ్యోతి పాల్గొన్నారు.

మిత్రుల చేయూత

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేటకు చెందిన వనిత భర్త మల్లేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. వనితతో కలిసి 1999–2000 బ్యాచ్ 7వ తరగతి చదువుకున్న జెడ్పీహెచ్‌ఎస్ మిత్రులు తమవంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. సుధాకర్, రాజన్న, సుస్మిత, సవిత, ఇలియాస్, తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాందలో భారీ వర్షం

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడింది.

వాసవి వరల్డ్‌లో బ్లూ కలర్ డే

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్ పాఠశాలలో శనివారం బ్లూ కలర్ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బ్లూ కలర్ డ్రెస్‌లో ఆకట్టుకున్నారు. చిన్నారులకు ఆటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. పాఠశాల సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శైల జాయ్సన్ పాల్గొన్నారు.

హద్దురాళ్ల ఏర్పాటు సరికాదు

కడెం: మండలంలోని మాసాయిపేట్ శివారులోని శ్మశానవాటికలో అటవీ అధికారులు ఏర్పాటు చేసిన హద్దురాళ్లను గ్రామస్తులు ఆదివారం పరిశీలించారు. అటవీ భూముల పేరుతో తాతాల కాలం నాటి శ్మశానం చుట్టూ హద్దురాళ్లు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కందకాలు తవ్వి వ్యవసాయ భూములకు వెళ్లే దారి మూసివేసి, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

కాలనీలో నీటి పైపులైన్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం ఆదివారం పైపులైన్ వేశారు. దీంతో నీటి సమస్య తీరుతుందని కాలనీవాసులు తెలిపారు. కాంగ్రెస్ మండల నాయకులు ఈటెల శ్రీనివాస్, రమేశ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతు


మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

నర్సాపూర్(జి): స్థానిక పశువైద్యశాల పక్కన గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పైపులైన్ వద్ద లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతుంది. దీని గురించి వివరిస్తూ 'భగీరథ నీరు వృథా' శీర్షికన సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ స్పందించారు. సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మతు చేయించి నీటి వృథాను అరికట్టారు.

రాథోడ్ మృతి తీరనిలోటు


నివాళులర్పిస్తున్న రాథోడ్ అభిమానులు

కడెం: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మృతి తీరని లోటని ఆయన అభిమానులు, గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామంలో రాథోడ్ రమేశ్ చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజవర్గానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. జడ ఇందూర్‌నేత, సకినాల ప్రవీణ్, శ్రీనివాస్, సిద్దు, తదితరులున్నారు.

ముత్యాలమ్మకు ఇత్తడి మకరతోరణం


మకరతోరణం బహూకరిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాలలోని ముత్యాలమ్మకు రూ.13 వేల విలువ చేసే ఇత్తడి మకర తోరణాన్ని హైదరాబాద్ కంటోన్మెంట్ రిటైర్డ్ సూపరింటెండెంట్, ముత్యాలమ్మ ఆలయ నిర్మాణ దాత ఓడ్నం గజ్జారాం–లక్ష్మి దంపతులు ఆదివారం బహూకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. ఓడ్నం ప్రవీణ్‌కుమార్, నవీన్, రాము, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా సమితి కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన అయ్యప్ప సేవా సమితి కార్యవర్గం

నిర్మల్‌టౌన్: నిర్మల్ అయ్యప్ప సేవాసమితి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కనపర్తి విగ్నేశ్, కోశాధికారిగా సాయి, గౌరవ అధ్యక్షుడిగా జాప ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని సేవా సమితిసభ్యులు సన్మానించారు. మేడారం ప్రదీప్, సేవా సమితి సభ్యులు, తదితరులు ఉన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కొన్నిరోజులుగా అప్రకటిత కోతలతో జనం పరేషాన్ అవుతున్నారు. ఇక వర్షం, గాలిదుమారం వస్తే ఇక అంతే సంగతి. రాత్రివేళలో దోమలు, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, పోస్టాఫీస్, మీసేవ కేంద్రాలకు వచ్చే వారు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటున్నాయి. సబ్‌స్టేషన్‌కు ఫోన్లు చేస్తే లిఫ్ట్ చేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

క్రికెట్ అభిమానుల సంబరాలు

నర్సాపూర్(జి): టి20 వరల్డ్ కప్ విజేతగా టీమిండియా గెలుపొందడంతో మండల కేంద్రంలో ఆదివారం క్రికెట్ అభిమానులు సంబురాలు జరుపుకొన్నారు. బాణాసంచా కాల్చారు. భూమారెడ్డి, కొంద్ర రమేశ్, శంకర్, మహేశ్, లక్ష్మణ్, దినేశ్, శ్రీనివాస్, ముత్యం, అబ్బు పాల్గొన్నారు.

అమ్మ సాక్షిగా..కమ్ముకొచ్చే..


వానాకాలం మొదలై నెలవుతున్నా.. ఇప్పటిదాకా పెద్దగా వానలు కురవలేదు. ఇప్పుడిప్పుడే జిల్లాలో వర్షాలు పలకరిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి, పావుగంట పాటు భారీగానే వాన కురిసింది. జిల్లాకేంద్రం సమీపంలోని శాకెర వాసవీ అమ్మవారి ఆలయం వద్ద ఇలా కారుమబ్బులు కమ్ముకొచ్చాయి. – నిర్మల్

పదెకరాల్లోపు రైతులకు 'భరోసా' అందించాలి


కుభీర్: పాల్గొన్న రైతులు

భైంసారూరల్: పదెకరాల వారికి రైతుభరోసా అందించాలని రైతులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆదివారం భైంసా మిర్జాపూర్ సహకార సంఘ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోపరేటివ్ అధికారులు నర్సయ్య, జగదీశ్‌లు వారి అభిప్రాయాలను సేకరించారు. అత్యధిక రైతులు పదెకరాల వరకు రైతు భరోసా కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు రైతుభరోసా నిలిపివేయాలన్నారు. మిర్జాపూర్ సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చాకెటి లస్మన్న, డైరెక్టర్లు పాల్గొన్నారు.

తానూరు: స్థానిక రైతువేదిక కార్యాలయంలో ఆదివారం రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని డీఏవో అంజిప్రసాద్ తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ నారయణ్‌రావ్‌పటేల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగనాథ్, సీఈవో భూమయ్య, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


భైంసారూరల్: రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

కుభీర్: మండల వ్యవసాయ సహకార సంఘ భవనంలో ఆదివారం రైతుల నుంచి అధికారులు అభిప్రాయాలు స్వీకరించారు. పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. రేషన్ కార్డుకు సంబంధం లేకుండా అందించాలన్నారు. సమావేశంలో సహకార సంఘం చైర్మన్ రేకుల గంగాచరణ్, సహకార సంఘం రిజిస్ట్రార్ జె.నర్సయ్య, ఏవో వికారొద్దిన్, సీవో క్రాంతికుమార్, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

కుంటాల: మండలంలోని విఠాపూర్‌లో వర్షం కురవాలని రైతులు ఆదివారం పూజలు చేశారు. డప్పు, వాయిద్యాలతో గ్రామస్తులతో ఆలయాలకు ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. వీడీసీ చైర్మన్ సాయన్న, కోశాధికారి లింగారెడ్డి, కార్యదర్శి సురేశ్, చిన్నారెడ్డి, భోజన్న, పోశెట్టి, సాయికృష్ణ, సంగ రతన్, భూమన్న, లింగురాం పటేల్, లక్ష్మీరమేశ్, నవీన్ రెడ్డి, సీహెచ్ అశోక్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరా, పంచగుడి, వట్టోలి తదితర గ్రామాల్లో ఆరెల్లి మైసమ్మ, ముత్యలమ్మ, మహాలక్ష్మీ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. గ్రామాల సమీపంలోని గోదావరినది నుంచి జలాలు తీసుకువచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కు చెల్లించుకున్నారు. గ్రామాల సర్పంచులు తదితరులు ఉన్నారు.


కుంటాల: డప్పు,వాయిద్యాలతో ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

బోనాల సందడి


తానూరు: బోనంతో వెళ్తున్న భక్తులు

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో గల గోశాల అమ్మవారి ఆలయంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. అహిర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయ డప్పు వాయిద్యాల నడుమ, భజన, కీర్తనలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు బాగా కురిసి, సమృద్ధిగా పంటలు పండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అహిర్ యాదవ సంఘం పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

తానూరులో..

తానూరు: మండలకేంద్రంలోని డాంగపల్లిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో భక్తులు బోనాలతో ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. పింటుమహారాజ్ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


భైంసాటౌన్: పూజలు చేస్తున్న మహిళలు

ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీ గండిరామన్న దత్తసాయి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయి సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

పోచమ్మకు మొక్కు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో మందపోచమ్మ అమ్మవారికి కుర్మ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు మొక్కు చెల్లించుకున్నారు. ఆదివారం వారు బోనాలు నెత్తిన పెత్తుకుని ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కుర్మసంఘం సభ్యులు బాబు, పోతన్న, లక్ష్మణ్, పీరాజీ, బీరప్ప, లింగన్న, వీరన్న తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం పోచమ్మ అమ్మవారికి భక్తులు మొక్కు చెల్లించుకున్నారు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో పూజలు చేశారు.



ఆదమరిస్తే అంతే..

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం నుంచి మల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై గల కాలువపై కల్వర్టుకు రక్షణ గోడ లేదు. రాత్రి సమయంలో వాహనదారులు ఆదమరిచి వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వీరస్వామి


భరద్వాజ దంపతులను సన్మానిస్తున్న లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వీరస్వామి నియామకయ్యారు. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన పి.భరద్వాజ ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన భరద్వాజను కళాశాల సిబ్బంది సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గత 36 ఏళ్లుగా పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. 1988లో అసోసియేట్ లెక్చరర్‌గా ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో చేరారు. కార్యక్రమంలో లెక్చరర్లు రాజ్‌కుమార్, రాజన్న, సుజయ్, జ్యోత్స్న రాణి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లోని పొలాల్లో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. రెండు రోజుల క్రితం వేలాడే విద్యుత్ వైరు తగిలి ఓ గేదె మృతి చెందింది. గతనెలలో స్తంభం సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో మరో గేదె మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.